https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్


తెలుగు దినపత్రిక

సంపుటి - 02 | సంచిక -57 | తెలంగాణ | మంగళవారం | తేదీ: 15.07.2025 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3



## లార్డ్స్ టెస్టు.. పోరాడి ఓడిన భారత్

2లో..



# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

- 36 ఏళ్లు రాజకీయాల్లో ఉన్న అశోక్ గజపతి
- 7 సార్లు ఎమ్మెల్యేగానూ, ఒక సారి ఎంపీగా విజయం

సిద్దిపేట టైమ్స్, న్యూఢిల్లీ/హైదరాబాద్ ప్రతినిధి, జూలై 14 :
మూడు రాష్ట్రాలకు గవర్నర్లను నిమించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా.. గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు.. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్‌ను నియమించారు.. అయితే, సీనియర్ రాజకీయ నేత, ఏపీ మంత్రిగా, కేంద్ర మంత్రిగానూ సేవలు అందించిన విజయనగరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ఇప్పుడు గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్నారు.

2లో..

## అవకాశాల కోసం నేనెప్పుడూ పరుగెత్తలేదు



- గవర్నర్‌గా తన పేరును ఏపీ సీఎం సిఫార్సు చేయడం ఆనందాంగా ఉంది
- మీడియాతో అశోక్ గజపతిరాజు

సిద్దిపేట టైమ్స్, విజయనగరం ప్రతినిధి, జూలై 14 :
అవకాశాల కోసం తానెప్పుడూ పరుగెత్తలేదని తెదేపా సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. గవర్నర్‌గా తన పేరును సీఎం చంద్రబాబు సిఫార్సు చేయడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం విజయనగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



## భూమికి తిరిగొస్తున్న శుభాంశు శుక్లా

### కుటుంబ సభ్యుల ప్రార్థనలు

ఢిల్లీ : శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి పుడమికి తిరిగొస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఆయన కుటుంబ సభ్యులు ఉద్వేగంతో ఎదురుచూస్తున్నారు. ఆయన సురక్షితంగా తిరిగిరావాలని సోమవారం శివాలయంలో పూజలు చేసినట్లు తల్లి ఆశా దేవి తెలిపారు. మరోవైపు శుభాంశు.. ఏడు ప్రయోగాలనూ విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో తెలిపింది.

2లో..


# రేషన్ కార్డు పేదోళ్ల ఆత్మగౌరవం!


### 5.61 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు.. 3.10 కోట్ల మందికి సన్నబియ్యం


- ప్రభుత్వం ఏర్పాటై నుంచి రెండేళ్లయ్యే లోపు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ పక్కాగా అమలు చేస్తాం..
- గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం..
- సూర్యాపేట జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సిద్దిపేట టైమ్స్, సూర్యపేట ప్రతినిధి, జూలై 14 :
తెలంగాణలో రేషన్ కార్డు కేవలం సరుకులు అందించే పత్రం మాత్రమే కాకుండా, అది పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ పేదల సంక్షేమం పట్ల తన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రేషన్ కార్డు పేదవాడి గుర్తింపు అని, ఆకలి తీరేందుకు ఉపయోగపడే ఆయుధమన్నారు. కానీ గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ విషయం తెలుసనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు.

2లో..





# సీనియర్ నటి సరోజాదేవి కన్నుమూత

- అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతూ బెంగళూరులోని తన నివాసంలోనే వదిలిన తుదిశ్వాస
- 13 ఏళ్లకే వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగు
- తెలుగు, కన్నడ, తమిళంలో సూపర్ హిట్ సినిమాలు
- 200 లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించిన సరోజాదేవి
- పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన ప్రభుత్వం

2లో..

సిద్దిపేట టైమ్స్, బెంగళూరు/హైదరాబాద్ ప్రతినిధి, జూలై 14 :
దక్షిణ భారత సినిమా రంగంలో నాలుగు దశాబ్దాలపాటు అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ సీనియర్ నటి బి. సరోజాదేవి ఇకలేరు. అనారోగ్యంతో బెంగళూరులోని తన నివాసంలో ఆమె(87) తుదిశ్వాస విడిచారు. 1940 జనవరి 7న బెంగళూరులో జన్మించిన సరోజాదేవి చిన్నతనంలోనే శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించిన సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్‌లతో కలిసి స్క్రీన్ షేర్ చేసారు.



## విద్వేష ప్రసంగాల కట్టడికి చర్యలు తీసుకోండి

- కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : విద్వేషపూరిత ప్రసంగాల కేసులపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇటువంటి ప్రసంగాలను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అదే సమయంలో భావప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించకూడదని స్పష్టం చేసింది. వాక్ స్వాతంత్ర్యపు విలువలను పౌరులు తెలుసుకొని, విద్వేషపూరిత ప్రసంగాల పట్ల సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలిపై వజహత్ ఖాన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

2లో..



## తిరుపతిలో రైలు బోగీలో మంటలు

సిద్దిపేట టైమ్స్, తిరుపతి ప్రతినిధి, జూలై 14 :
తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. తిరుపతి రైల్వే యార్డులోని హిసార్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగి బోగీ పూర్తిగా కాలిపోయింది. రాజస్థాన్‌లోని హిసార్ నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఉదయం 11.50కి చేరుకుంది. ప్రయాణికులను రైల్వే స్టేషన్‌లో దింపేసిన తర్వాత యార్డులోకి వెళ్తున్న క్రమంలో ఇంజిన్ వెనకవైపు ఉన్న బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో పక్క ట్రాక్‌పై ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగీలోకి మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పివేసేలోగా హిసార్ ఎక్స్‌ప్రెస్ బోగీ పూర్తిగా కాలిపోయింది.

2లో..

## రాష్ట్ర హైకోర్టు సీజేగా అపరేష్ కుమార్ సింగ్

**ఢిల్లీ:** దేశంలో పలువురు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను రాష్ట్రపతి ఆమోదించడంతో కేంద్ర న్యాయ శాఖ బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయన త్రిపుర హైకోర్టు సీజేగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఝార్ఖండ్ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావును త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. మద్రాస్, రాజస్థాన్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కూడా బదిలీ చేస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు మద్రాస్



హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేశారు. గతంలోనూ ఆయన ఏపీ హైకోర్టు జడ్జిగా పనిచేశారు

## వరి నాటు వేసిన బెజ్జంకి ఎస్సై సౌజన్య

- సాధారణ వ్యక్తిలా కూలీలతో మమేకమై మాటామంతీ..
- పెరుగుతున్న స్నాచింగ్.. జాగ్రత్తలపై అవగాహన
- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచన



సిద్దిపేట టైమ్స్, బెజ్జంకి, జూలై 14
ఎస్సై అంటే.. అదో హుందా.. హోదా.. కాని ఈ ఎస్సై.. అందుకు.. బిన్నం.. తను ఒక అసాధారణ వ్యక్తిగా.. వ్యవహరించి... తన వ్యక్తుత్వాన్ని... చాటుకుంది.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎస్సై సౌజన్య.

2లో..

# విద్వేష ప్రసంగాల కట్టడికి చర్యలు తీసుకోండి

**- కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు**

**న్యఢిల్లీ :** విద్వేషపూరిత ప్రసంగాల కేసులపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇటువంటి ప్రసంగాలను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అదే సమయంలో భావప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించకూడదని స్పష్టం చేసింది. వాక్ స్వాతంత్ర్యపు విలువలను పౌరులు తెలుసుకొని, విద్వేషపూరిత ప్రసంగాల పట్ల సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలిపై వజహత్ ఖాన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. విద్వేషపూరిత ప్రసంగాలు చేసేవారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. ఇటువంటి వ్యాఖ్యలను షేర్ చేయకుండా కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ప్రజలు కూడా ఇటువంటి వాటిని షేర్ చేయకుండా సంయమనం పాటించాలని సూచించింది. ఇక్కడ సెన్సార్‌షిప్ గురించి మాట్లాడటం లేదని, కానీ ప్రజలు మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాలని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో విభజన ధోరణిని అడ్డుకోవాలని వ్యాఖ్యానించింది. భావప్రకటనా స్వేచ్ఛపై బాధ్యతాయుతమైన ఆంక్షలు సరైనవేనని సుప్రీంకోర్టు పేర్కొంది. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు కోరింది.

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు..

**- 36 ఏళ్లు రాజకీయాల్లో ఉన్న అశోక్ గజపతి**
**- 7 సార్లు ఎమ్మెల్యేగానూ, ఒక సారి ఎంపీగా విజయం**

**సిద్దిపేట టైమ్స్, న్యూఢిల్లీ/ హైదరాబాద్ ప్రతినిధి, జూలై 14 :**
మూడు రాష్ట్రాలకు గవర్నర్లను నిమించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా.. గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు.. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్‌ను నియమించారు.. అయితే, సీనియర్ రాజకీయ నేత, ఏపీ మంత్రిగా, కేంద్ర మంత్రిగానూ సేవలు అందించిన విజయనగరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ఇప్పుడు గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్నారు.. దీంతో, ఉత్తరాంధ్రకు రెండో కీలక పదవి దక్కినట్టు అయ్యింది.. ఇప్పటికే ఒడిశా గవర్నర్‌గా ఉన్న కంభంపాటి హరిబాబు ఉండగా.. ఇప్పుడు గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు నియమితులు అయ్యారు.. అయితే, తన 36 ఏళ్లు సుదీర్ఘ రాజకీయ జీవితంలో.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఉమ్మడి ఏపీలో మంత్రిగా, కేంద్ర మంత్రిగా ఇలా వివిధ హోదాల్లో ఆయన సేవలు అందించారు..

**అశోక్‌గజపతిరాజు ప్రస్థానం ఇదే...**
అశోక్‌గజపతిరాజు తొలిసారిగా జనతా పార్టీ తరపున 1978లో పోటీ చేశారు.. ఆపై 1983, 1985, 1989, 1994, 1999, 2009లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.. మొత్తం 36 ఏళ్ల రాజకీయ జీవితంలో 7 సార్లు ఎమ్మెల్యేగానూ, ఒక సారి ఎంపీ గానూ పదవీ బాధ్యతలు చేపట్టారు. పదవీ కాలంలో ఎన్నో మార్లు ఆంధ్ర ప్రదేశ్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసారు. ఇక, 2014లో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం నుండి పోటీ చేసి 16వ లోక్‌సభకు ఎంపీగా ఎన్నుకోబడ్డారు. దీంతో, నరేంద్ర మోడీ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా.. పౌర విమానయాన శాఖ బాధ్యతలు చేపట్టారు. అంతేకాదు, గతంలో ఎన్టీ రామారావు క్యాబినెట్ లో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగానూ, చంద్రబాబునాయుడు హయాంలో ఫైనాన్స్, లెజిస్లేటివ్ అఫెయిర్స్ ఇంకా రెవెన్యూ శాఖలలో మంత్రిగా పనిచేసారు. ప్రస్తుతం తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా కొనసాగుతున్న ఆయన్ను.. గోవా గవర్నర్‌గా పంపించింది కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్.. కేంద్ర మాజీ మంత్రి పుసపాటి అశోక్ గజపతి రాజు.. 26 జూన్ 1951లో విజయనగరం రాజ కుటుంబంలో జన్మించారు.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, వీఎస్ కృష్ణ కాలేజ్, విశాఖపట్నంలో ఆయన విద్యాభ్యాసం కొనసాగింది.. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా, MANSAS (Maharaja Alak Narayana Society) ట్రస్ట్ చైర్మన్‌గా సేవలు అందించారు.. అయితే, 1978న జనతా పార్టీ తరఫున విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.. ఆ తర్వాత 1982లో ఎన్టీఆర్ ఆధ్వర్యంలో, ఆ తర్వాత 1983 నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపొందారు. ఏపీ కేబినెట్‌లో ఎక్సైజ్ (1985-89), వాణిజ్య పన్నులు, Legislative Affairs, ఆర్థిక, రెవెన్యూ (1994-2004), 2014లో విజయనగరం నుంచి లోక్‌సభ ఎంపీ.. 26 మే 2014-9 మార్చి 2018 వరకు కేంద్ర విమానయాన మంత్రిగా పనిచేశారు.. ఇక, 2018 మార్చిలో ఏపీ స్పెషల్ స్టేటస్ వివాదం కారణంగా రాజీనామా చేశారు. MANSAS ట్రస్ట్ పై వృద్ధి, విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో ఆధారిత ప్రోగ్రామ్‌లు పరిగణనీయంగా విస్తరించారు.. ఆయన తండ్రి పీవీజీ Raju ఆధ్వర్యంలో స్థాపిత Simhachalam and ఇతర ఆలయాల వారసత్వం కొనసాగిస్తున్నారు. అశోక్ గజపతి రాజు విజయనగరం రాజ కుటుంబానికి చెందిన, దక్షిణ భారతంలోని ప్రముఖ రాజకీయ దార్శనికుడు. రాష్ట్రంలో పన్ను, ఆర్థిక, ఏరియా అభివృద్ధి, కేంద్ర విమానయాన విధానాల పైన ముఖ్య పాత్రలు పోషించారు. మరోవైపు, గత సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో టీడీపీజనసేనబీజేపీ అపూర్వ విజయాన్ని అందుకోగా.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలోనూ టీడీపీ కీలకంగా మారింది.. ఈ ఎన్నికల్లో సీనియర్ నేతలను పక్కన బెట్టిన టీడీపీ.. ఇప్పుడు పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉన్న అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ పదవి ఇప్పటించి గౌరవించింది.



# అవకాశాల కోసం నేనెప్పుడూ పరుగెత్తలేదు

**- గవర్నర్‌గా తన పేరును సీఎం చంద్రబాబు సిఫార్సు చేయడం ఆనందంగా ఉంది**
**- అభినందనలు తెలుపుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు**
**- మీడియాతో అశోక్ గజపతిరాజు**

**సిద్దిపేట టైమ్స్, విజయనగరం ప్రతినిధి, జూలై 14 :**
అవకాశాల కోసం తానెప్పుడూ పరుగెత్తలేదని తెదేపా సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. అవకాశాలు వచ్చినప్పుడు బాధ్యతగా స్వీకరించానని చెప్పారు. గవర్నర్‌గా తన పేరును సీఎం చంద్రబాబు సిఫార్సు చేయడం ఆనందంగా ఉందన్నారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిని నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయనగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ నియామకంతో తెలుగువారి గౌరవాన్ని మరింత పెంచే బాధ్యత నాపై ఉంది. ఓటమితో నిరుత్సాహ పడనక్కర్లేదు.. దాని నుంచి పాఠాలు నేర్చుకుని మరింత ఉన్నతంగా ముందుకు వెళ్లొచ్చు. గోవా అంటే ప్రియ మిత్రుడు మనోహర్ పారికర్ గుర్తొస్తారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో అమ్మాయిలకూ చదివే అవకాశం కల్పించాలని ఆయన రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు కోరాను. దేశానికి సేవ చేసే అవకాశం మరోసారి లభించడం ఆనందంగా ఉంది. అభినందనలు తెలుపుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని అశోక్ గజపతిరాజు అన్నారు.



# తిరుపతిలో రైలు బోగీలో మంటలు

**సిద్దిపేట టైమ్స్, తిరుపతి ప్రతినిధి, జూలై 14 :**
తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. తిరుపతి రైల్వే యార్డులోని హిసార్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగి బోగీ పూర్తిగా కాలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్‌లోని హిసార్ నుంచి హిసార్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఉదయం 11.50కి చేరుకుంది. రెండున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ప్రయాణికులను రైల్వే స్టేషన్‌లో దింపేసిన తర్వాత యార్డులోకి వెళ్తున్న క్రమంలో ఇంజిన్ వెనకపైపు ఉన్న బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో పక్క ట్రాక్‌పై ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగీలోకి మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పి వేసేలోగా హిసార్ ఎక్స్‌ప్రెస్ బోగీ పూర్తిగా కాలిపోయింది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని జనరేటర్ బోగీ పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై ఆర్‌పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రైలు బోగీలో మంటల కారణంగా ఇతర రైలు సేవలకు ఎటువంటి అంతరాయం కలగలేదని రైల్వే అధికారులు తెలిపారు. హిసార్‌తిరుపతి స్పెషల్ (04717) రైలులోని ఖాళీ బోగీని స్టెబ్లింగ్ యార్డ్‌లోకి తీసుకెళ్తుండగా మంటలు చెలరేగాయని చెప్పారు. అప్రమత్తమైన సిబ్బంది మంటల్ని ఆర్పేశారని, అవసరమైన అగ్నిమాపక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దీనిపై మరింత దర్యాప్తు జరుగుతుందని చెప్పారు. ఈ ఘటనతో తిరుపతి రైల్వేస్టేషన్‌కు వచ్చి వెళ్లే రైళ్లకు ఎలాంటి అంతరాయం లేదని తెలిపారు.

# రేషన్ కార్డు పేదోళ్ల ఆత్మగౌరవం!

**- 5.61 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు.. 3.10 కోట్ల మందికి సన్నబియ్యం**
**- ప్రభుత్వం ఏర్పాటై నుంచి రెండేళ్లయ్యే లోపు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తాం**
**- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ పక్కాగా అమలు చేస్తాం..**
**- గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం..**
**- సూర్యాపేట జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**సిద్దిపేట టైమ్స్, సూర్యాపేట ప్రతినిధి, జూలై 14 :**
తెలంగాణలో రేషన్ కార్డు కేవలం సరుకులు అందించే పత్రం మాత్రమే కాకుండా, అది పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడురతూ పేదల సంక్షేమం పట్ల తన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రేషన్ కార్డు పేదవాడి గుర్తింపు అని, ఆకలి తీరేందుకు ఉపయోగపడే ఆయుధమన్నారు. కానీ గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ విషయం తెలుసనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు. వారి పాలనలో రేషన్ కార్డులు మంజూరు చేయడం, సన్నబియ్యం అందించడం అనే అంశాలు వెనుకబడ్డాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రవ్యాప్తంగా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందించామని తెలిపారు. ప్రజలకు అవసరమైన పథకాలను అమలు చేస్తుంటే, రేషన్ షాపుల వద్ద బారులు తీరుతున్నాయి. ఇది మాకు గర్వకారణం అన్నారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం వ్యవసాయాన్ని పండగగా మలుస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నాం. దేశం మొత్తం నోరు తీసేలా తెలంగాణ వరి ఉత్పత్తిలో ముందు నిలుస్తోంది అని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై కూడా ఈ సందర్భంగా రేవంత్ తీవ్ర విమర్శలు చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు గోదావరి నీటిని తుంగతుర్తికి తేవలేకపోయిన వారు, ఇప్పుడు మన ప్రభుత్వం ప్రయత్నిస్తే అడ్డుకుంటామని అంటున్నారు. వారు గతంలో మూడు రోజులు సమయం ఇవ్వండి, నీళ్లు తెస్తాం అన్నారు. కానీ పదేళ్లు అధికారంలో ఉన్నా నీటి తాలూకూ కనిపించలేదు. దండగ అన్న వ్యవసాయాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పండగ చేశామన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడమే కాకుండా రూ.500 బోనస్ ఇచ్చామని, 25,55,965 మంది రైతులకు రూ.25 వేల కోట్లు వెచ్చించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే 1.50 కోట్ల ఎకరాలకు, 70 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్ల రైతుభరోసా అందించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. అంతేకాకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొన్నామని, దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలో 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రికార్డు సృష్టించామని అన్నారు. రాష్ట్రంలో 65 లక్షల మంది ఆడబిడ్డలకు రెండు చీరలు అందించామని సీఎం రేవంత్ తెలిపారు. రూ.21 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ ఇచ్చి వారి ఉపాధికి తోడ్పాటునందించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామని, ఈ పథకం కింద రూ.6500 కోట్లు ఖర్చవుతున్నా.. అది ఆడబిడ్డలపై పెట్టిన పెట్టుబడిగా చూస్తున్నామే తప్ప దానిని ఉచిత పథకంగా చూడడం లేదని చెప్పారు. 600 బస్సులకు ఆడబిడ్డలను యజమానులను చేశామని, వాటిని 1000 బస్సులకు పెంచుతున్నామని అన్నారు. బస్సులను ఆర్టీసీకి అద్దెకివ్వడం ద్వారా ఆడబిడ్డలకు ఆదాయం వస్తోందన్నారు. ఆడబిడ్డలే 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు తయారు చేసేలా వారికి ప్లాంట్లను అప్పజెప్పామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగ అవకాశం కూడా ఇవ్వలేదని రేవంత్ ఆరోపించారు. తాము వచ్చాక ఇప్పటికే 59 వేల ఉద్యోగాలిచ్చామని, తమ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయ్యేనాటికి లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామని ప్రకటించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వారివద్ద రూ.20 లక్షల కోట్లున్నా, లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టినా అది మూడేళ్లలో కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ ఆరోపించారు. "60, 70 ఏళ్ల క్రితం కాంగ్రెస్ కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం, మూసీ, జూరాల, దేవాదుల, ఎస్‌ఆర్‌ఎస్పీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎలా ఉన్నాయో, మీరు కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో చర్చకు సిద్ధమా!" అని సవాల్ చేశారు. బీఆర్‌ఎస్ నేతలను కాళేశ్వరం వద్ద ఉరితీసినా తప్పులేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, ఎవరేం చేసినా తెలంగాణలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్ జెండానే రెపరెపలాడుతుందని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక ఎస్సీ వర్గీకరణ చేపట్టామని సీఎం రేవంత్ అన్నారు. దేశ చరిత్రలో వందేళ్ల తర్వాత జనగణనలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ వర్తింపజేసి తీరుతామని, బలహీనవర్గాల వారిని రాజ్యాధికారం వైపు నడిపించే పయనం ఆగదని ప్రకటించారు. ఈ సందర్భంగా సూర్యాపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తమ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ఆయన చెబుతున్నారని, ఒక్కసారి అడ్డుకొని చూస్తే కాంగ్రెస్ కార్యకర్తల తడాఖా ఏంటో ఆయనకు తెలుస్తుందని అన్నారు. మూడు రోజుల్లో గోదావరి నీళ్లు తెస్తానంటున్న వ్యక్తి.. పదేళ్లు అధికారమిస్తే తుంగతుర్తికి గోదావరి నీళ్లు ఎందుకు తేలేదని ప్రశ్నించారు. 'గోదావరి నీళ్లు తేవడమంటే.. మందులో సోడా పోసినట్లు కాదు' అని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు గంజికి కూడా కష్టమైన జగదీశ్‌రెడ్డికి నేడు బెంజి కారు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలు ఆలోచించాలన్నారు. నల్లగొండ జిల్లాలో ఆయన ఓ గంజాయి మొకక్ అని, వచ్చే ఎన్నికల్లో ఈ మొక్కను పీకి పారేయాల్సిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉందని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని, ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలనే గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. "రాష్ట్రంలో ఈరోజు 5.10 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు, 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఈరోజు తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు" మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, మునుగోడు, హుజూరాబాద్ వంటి ఉప ఎన్నికల సమయంలో కొందరికి నామమాత్రంగా కార్డులిచ్చారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.12 వేల కోట్లతో ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు వేసేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. కాగా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీతో పేదల కళ్లలో ఆనందం కనిపిస్తోందని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అంతకుముందు రూ.39.50 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులు మంత్రులతో కలిసి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ నటి సరోజాదేవి కన్నుమూత

**- అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతూ బెంగళూరులోని తన నివాసంలోనే వదిలిన తుదిశ్వాస**
**- 13 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగు**
**- తెలుగు, కన్నడ, తమిళంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌లతో పలు సూపర్ హిట్ సినిమాలు**
**- 200 లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించిన సరోజాదేవి**
**- పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన ప్రభుత్వం**

**సిద్దిపేట టైమ్స్, బెంగళూరు/హైదరాబాద్ ప్రతినిధి, జూలై 14 :**
దక్షిణ భారత సినిమా రంగంలో నాలుగు దశాబ్దాలపాటు అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ సీనియర్ నటి బి. సరోజాదేవి ఇకలేరు. అనారోగ్యంతో బెంగళూరులోని తన నివాసంలో ఆమె(87) తుదిశ్వాస విడిచారు. 1940 జనవరి 7న బెంగళూరులో జన్మించిన సరోజాదేవి చిన్నతనంలోనే శాస్త్రీయ సంగీతం, నృత్యం నేర్చుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించిన సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్‌లతో కలిసి స్క్రీన్ షేర్ చేసారు. 1955లో సినీరంగంలోకి అడుగుపెట్టి, కొద్ది కాలంలోనే అగ్రనటిగా ఎదిగిన ఆమె, దక్షిణాది సినిమాల వెలుగుతీరుగా నిలిచారు. ఆమె 1957లో 'పాండురంగ మహత్మ్యం' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టి, అదే ఏడాది 'భూకైలాస్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో కలిసి 'పెళ్లిసందడి', 'జగదేకవీరునికథ', 'మంచి చెడు', 'దాగుడు మూతలు', 'శకుంతల', 'సీతారామకల్యాణం', 'దానవీరశూరకర్ణ' వంటి అనేక హిట్ సినిమాల్లో నటించారు. 1963లో ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో కలిసి 'శ్రీకృష్ణార్జునయుద్ధం' సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. సరోజాదేవి తమిళ పరిశ్రమలోనూ తనదైన స్థానం సంపాదించారు. తమిళ సూపర్‌స్టార్ ఎంజీఆర్‌తో కలిసి ఏకంగా 26 సినిమాల్లో నటించి అరుదైన రికార్డు నెలకొల్పారు. అలాగే శివాజీ గణేషన్‌తో 'శెభాష్ మీనా', 'పుదిపరవై' వంటి సినిమాల్లో మెప్పించారు. మహాకవి కాళిదాసు చిత్రంలో విద్యాధరి పాత్ర ద్వారా ఆమె నటన పరాకాష్టకు చేరింది. తెలుగులో ఆమె చివరిసారిగా నటించిన చిత్రం 'సామ్రాట్ అశోక. 1969లో భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది. 1992లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. మహాకవి కాళిదాసు చిత్రానికి జాతీయ అవార్డు రావడంలో ఆమె పాత్ర ప్రాముఖ్యం సంతరించుకుంది. పాండురంగ మహత్మ్యం, భక్త ప్రహ్లాద, స్వర్గసీతా వంటి ఎన్నో చారిత్రక, భక్తి చిత్రాల్లో ఆమె నటన ముద్ర వేసింది. ఆమె మృతిపట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ భారత సినీ రంగానికి బి. సరోజాదేవి గారి మృతి తీరని లోటుగా భావిస్తున్నారు.

## భూమికి తిరిగొస్తున్న శుభాంశు శుక్లా

**- కుటుంబ సభ్యుల ప్రార్థనలు**

**ఢిల్లీ :** శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి పుడమికి తిరిగొస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఆయన కుటుంబ సభ్యులు ఉద్వేగంతో ఎదురుచూస్తున్నారు. ఒక చిన్నపిల్లాడిలా రోదసిలోని దృశ్యాలను చూపడం తమకు ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. "మా కుమారుడిని ఆశీర్వదించిన ప్రధాని మోదీకి, ప్రజలకు మా కృతజ్ఞతలు. శుభాంశుకు స్వాగతం పలకడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అయితే ఆయనను ఇప్పుడప్పుడే మేం కలవలేం. ఆయన తొలుత అమెరికా వెళతాడు'' అని శుభాంశు తండ్రి శంభు దయాల్ శుక్లా పేర్కొన్నారు. ఆయన సురక్షితంగా తిరిగిరావాలని సోమవారం శివాలయంలో పూజలు చేసినట్లు తల్లి ఆశా దేవి తెలిపారు. శుభాంశు రోదసిలోకి వెళ్లేటప్పుడున్న స్థాయిలో ఇప్పుడూ తమ కుటుంబం ఉద్వేగంతో ఉన్నట్లు ఆయన సోదరి శుచి శుక్లా పేర్కొన్నారు. మరోవైపు శుభాంశు.. ఏడు ప్రయోగాలనూ విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో తెలిపింది.



# వరి నాటు వేసిన బెజ్జంకి ఎస్సై సౌజన్య

**- సాధారణ వ్యక్తిలా కూలీలతో మమేకమై మాటామంతీ..**
**- పెరుగుతున్న స్నాచింగ్.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన**
**- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచన**

**సిద్దిపేట టైమ్స్, బెజ్జంకి, జూలై 14**
ఎస్సై అంటే.. అదో హుందా.. హోదా.. కాని ఈ ఎస్సై.. అందుకు.. బిన్నం.. తను ఒక అసాధారణ వ్యక్తిగా.. వ్యవహరించి... తన వ్యక్తిత్వాన్ని... చాటుకుంది.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎస్సై సౌజన్య. మండలంలోని ముత్తన్నపేటలో వ్యవసాయ కూలీలతో కలిసి ఎస్సై సౌజన్య వరి నాటు వేశారు. ఎస్సై కూలీలతో మమేకమై మాట్లాడుతూ.. ఇటీవల చైన్ స్నాచింగ్ దొంగతనాలు పెరుగుతున్నాయని, మహిళా కూలీలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కూలీ పనులకు వెళ్ళినప్పుడు మహిళలు బంగారు ఆభరణాలు ధరించకూడదని, ఒకవేళ ధరించినా ఒంటరిగా వెళ్లొద్దని ఆమె సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే 100కు డయల్ చేసి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# లార్డ్స్ టెస్టు.. పోరాడి ఓడిన భారత్

**- జడేజా పోరాటం వృథా..!**

**లార్డ్స్ :** ప్రతిష్ఠాత్మక లార్డ్స్ స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్టులో భారత్ పోరాడి ఓడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 22 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 193 పరుగుల లక్ష్యఛేదనలో.. 58/4తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన గిల్ సేన 170 రన్స్‌కు ఆలౌటైంది. రవీంద్ర జడేజా (61*; 181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) గొప్పగా పోరాడి జట్టును గెలుపు అంచుల వరకు తీసుకొచ్చాడు. మహ్మద్ సిరాజ్ (4; 30 బంతుల్లో) పదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, బెన్ స్టోక్స్ 3, బ్రైడన్ కార్స్ 2, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది.

**82 పరుగులకే 7 వికెట్లు**
నాలుగో రోజే యశస్వి జైస్వాల్ (0), కరుణ్ నాయర్ (14), శుభ్‌మన్ గిల్ (6), ఆకాశ్ దీప్ (1) పెవిలియన్‌కు చేరగా.. ఐదో రోజు ఆటలో తొలి గంటలోనే భారత్ మూడు వికెట్లు కోల్పోయింది. రిషభ్ పంత్ (9; 12 బంతుల్లో 2 ఫోర్లు)ని ఆర్చర్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. 33 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఆటను మొదలుపెట్టిన కేఎల్ రాహుల్ మరో ఆరు పరుగులు చేసి బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. తర్వాత ఓవర్‌లోనే వాషింగ్టన్ సుందర్ (0) ఆర్చర్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ 82 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో జడేజా, నితీశ్ రెడ్డి భారత్‌ను ఆదుకునే ప్రయత్నం చేశారు. నితీశ్‌ని క్రిస్ వోక్స్ వెనక్కి పంపడంతో 30 పరుగుల భాగస్వామ్యానికి (90 బంతుల్లో) తెరపడింది. ఈ క్రమంలోనే 112/8తో భారత్ లంచ్‌కు వెళ్లింది.

**బుమ్రా సపోర్ట్‌తో ముందుకు.. ఆఖర్లో ఉత్కంఠ**
లంచ్ తర్వాత బుమ్రా (5; 54 బంతుల్లో 1 ఫోర్) సపోర్ట్‌తో జడేజా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీని విడదీయడానికి ఇంగ్లాండ్ పేసర్లు చెమటోడ్చారు. బుమ్రా ఇంగ్లాండ్ పేసర్లకు అవకాశం ఇవ్వకుండా వికెట్ కాపాడుకున్నాడు. మరో ఎండ్‌లో జడేజా నిలకడగా సింగిల్స్ తీస్తూ లక్ష్యాన్ని కరిగించాడు. అయితే, బుమ్రాను స్టోక్స్ ఔట్ చేయడంతో 35 పరుగుల (131 బంతుల్లో) భాగస్వామ్యానికి తెరపడింది. ఈ క్రమంలో మ్యాచ్ ఫలితం తేలుతుందేమోనని సెషన్‌ను అర గంట పొడగించారు. కానీ, సిరాజ్ .. సహకారంతో భారత్‌ను జడేజా విజయం దిశగా నడిపించాడు. స్టోక్స్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి జడేజా అర్ధ శతకం (150 బంతుల్లో) అందుకున్నాడు. కాసేపటికి టీ విరామం ప్రకటించారు. చివరి సెషన్‌లో భారత్ విజయానికి 30 పరుగులు అవసరమైన దశలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ భారత బ్యాటర్లపై ఒత్తిడి పెంచింది. బషీర్ బౌలింగ్‌లో జడేజా నుంచి స్ట్రైక్ అందుకున్న సిరాజ్.. బ్యాక్‌ఫుట్ తీసుకుని బంతిని డిఫెండ్ చేశాడు. కానీ, బంతి అతని పక్క నుంచి వెళ్లి స్టంప్స్ తాకగా బెయిల్ కిందపడింది. దీంతో భారత్ ఆలౌటైంది.



# హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట జూలై 14:**

నిజాంపేట మండల పరిధిలోని జెడ్ చెరువు తండా గ్రామంలో సోమవారం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ మోహన్ నాయక్ ను మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ పేదలకు సేవా కార్యక్రమాలు చేసేవారు రాజకీయంలో రావడం శుభ పరిణయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ కలర్ పూసి వదిలేసేది కాదని కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటామన్నారు. నాతో ఉన్నవారు కొందరు బస్సు ఎక్కుతుంటారు. మరికొందరు బస్సు దిగుతుంటారు కానీ నాతో మంచి వారు ఉండటం వారికి హ్యాట్సాఫ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలను ఎల్లవేళలా అండగా ఉంటామని మెదక్ రామయంపేట నియోజకవర్గం ప్రజలు మైనంపల్లి హనుమంతరావు కుటుంబానికి రాజకీయ బిక్ష పెట్టారని వారిని కడుపులో పెట్టి చూసుకుంటామన్నారు. నేను చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఎవరు చేయలేరని నిరుపేద కుటుంబాలకు మైనంపల్లి కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎన్నికలలో తాగిపించడం తినిపించడం నా స్టైల్ కాదని ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమన్నారు. మెదక్ ఏడుపాయల వన దుర్గ మాత అమ్మవారికి ఏ ముఖ్యమంత్రి దర్శించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పిలిపించి అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించి 35 వేల కోట్ల నిధులు ఇచ్చిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. 29వేల కోట్లు మెదక్ చర్చికి కేటాయించిందన్నారు. అవసరానికి వాడుకునే వారు బీఆర్ఎస్ పార్టీ అని ఆంధ్ర వాళ్ళతో స్నేహం చేసిన వారు మీరు కాదా అని బిఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. పార్టీ వ్యక్తిగతంగా ఈనెల 17న మెదక్ లో టీపీసీసీ అధ్యక్షులు ఇన్చార్జి మంత్రి వివేక్ ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్ నాయక్ తో పాటు మాజీ సర్పంచులు సుమారు 2000 మందితో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరవేసేలా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ మోహన్ నాయక్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మైనంపల్లి హనుమంతరావు సూచనల మేరకు పార్టీ అధిష్టానానికి కట్టుబడి ఉండి పార్టీలో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, నసీరుద్దీన్, పంజా మహేందర్, కొమ్మటసత్యనారాయణ, చంద్రపాల్, నాగరాజు, దేమే యాదగిరి, సరాఫ్ యాదగిరి, కొమ్మాట బాబు, ఆకుల బాలయ్య, బాజా రమేష్, రవీందర్ రెడ్డి, సామల మహేష్, యూత్ అధ్యక్షులు రాంచందర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, రిషికేష్, లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.






# ఆయిల్ ఫామ్ సాగుతో మంచి ఆదాయం

**- కాంగ్రెస్ నాయకులు మన్నే కళ్యాణ్ ముదిరాజ్**

సిద్ది పేట టైమ్స్, తూప్రాన్ /మనోహరాబాద్ : అయిల్ ఫామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చు అని కాంగ్రెస్ నాయకులు మన్నే కళ్యాణ్ అన్నారు. మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి గ్రామంలో రైతు మన్నే కళ్యాణ్ గారి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటారు. వరి కంటే ఆయిల్ ఆయిల్ ఫామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని మనోహరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి నరేందర్ తెలిపారు. అయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ప్రభుత్వ సహకారంను సద్వినియోగం చేసుకుని వృద్ధి సాధించాలని వారు అన్నారు. అయిల్ ఫామ్ సాగు పై ఆసక్తి ఉన్న రైతులు ఈ నెంబర్ 8977725910 ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో కోనాయిపల్లి గ్రామ రైతులు దుర్గం పవన్ కుమార్ గౌడ్, మోతుకు రమేష్, రాజు, బక్క సుధాకర్ మరియు లీవ్ ఫామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ నిశాంత్ పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో మంజీరా విద్యాలయంలో ఘనంగా వనమహోత్సవం

**సిద్దిపేట ట్రైన్స్ రామాయంపేట జూలై 14:**

రామాయంపేట పట్టణంలోని మంజీరా విద్యాలయంలో వనమహోత్సవాన్ని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో భాగంగా ఎఫ్.ఆర్.ఓ అంబర్ సింగ్ గారు, వనమహోత్సవం మరియు చెట్ల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. చెట్లు లేకపోతే మానవ మనుగడ లేదని ,చెట్లు మాత్రమే చెడును తీసుకొని మంచిని ఇస్తాయని. మానవులు వదిలేటటువంటి కార్బన్డయాక్సైడ్ ను తీసుకొని ,ఆక్సిజన్ మానవులకు ఉపయోగపడేటటువంటి ఆక్సిజన్ ఇస్తాయని ఇనుము ఎలా అయితే అయస్కాంతాన్ని ఆకర్షిస్తుందో ఆ విధంగా చెట్లు మేఘాలను ఆకర్షించే వర్షాలను కురిపింప చేస్తాయని ప్రతి రోజు మానవుడికి మూడు సిలిండర్ల ఆక్సిజన్ అవసరం ఉంటుందని ఒక సిలిండర్ విలువ 700 రూపాయలు అయినట్లయితే రోజుకి 2100 ఖర్చు అవుతుందని సంవత్సరానికి 7,66,500 అలాంటి ఆక్సిజన్ ని మనం ఉచితంగా తీసుకోగలుగుతున్నాం. అందరికీ ఆక్సిజన్ సిలిండర్ల అవసరము పడితే సిలిండర్లు దొరకక ఏ విధమైనటువంటి క్లిష్ట పరిస్థితి ఏర్పడుతుందో కరోనా సమయంలో అందరం చూసినటువంటిదే కాబట్టి చెట్లను నాటడం వాటిని సంరక్షించడం చెట్లతో పాటుగా అడవిని, జంతువులను ,నీటిని పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పడం జరిగింది. అదేవిధంగా ప్రతి విద్యార్థి అమ్మ పేరు పైన ఒక చెట్టును నాటాలని అమ్మను ఏ విధంగా చూసుకుంటారో ఆ చెట్టుని ఆ విధంగా చూసుకోవాలని విద్యార్థులకు వివరించడం జరిగింది. అమ్మ పేరు పైన చెట్టు నాటడం అనేది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడి గారు చెప్పినటువంటి నినాదం. క్రమం తప్పకుండా మనం అందరం పాటించాలని చెప్పడం జరిగింది. మంజీరా పాఠశాలలో ఎఫ్ఆర్ఓ అంబర్ సింగ్ గారు, డిప్యూటీfro శ్రీనివాస్ గారు ,గీత ,కృష్ణ గారు చెట్లను నాటడం జరిగింది .విద్యార్థుల చేత మొక్కలు నాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ జితేందర్ రెడ్డి వాసవి, ప్రిన్సిపల్ సురేష్ ,అనిల్ ,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.





# మంత్రాలు చేస్తున్నాడన్న నెపంతో యువకుడి దారుణహత్య

సిద్దిపేట టైమ్స్ జహీరాబాద్, జులై 14: మృతుడు మహమ్మద్ తాజుద్దీన్ జహీరాబాద్ అనే యువకుడు అమావాస్య, పౌర్ణమికి బాణామతి చేస్తున్నాడనే అనుమానంతో, మహమ్మద్ హాసన్ ఖురేషి జహీరాబాద్ అనే వ్యక్తి తన మిత్రుడైన షేక్ ముక్రం తో కలిసి మృతుడు తాజుద్దీన్ ను హత్య చేసినట్లు జహీరాబాద్ డిఎస్పీ సైదా మీడియా సమావేశంలో తెలిపారు. సోమవారం జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ లో పట్టణ సిఐ ఎస్ శివలింగం, ఎస్ఐ కె వినయ్ తో కలిసి డిఎస్పీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి హత్యా వివరాలు వెల్లడించారు. యండి హాసన్ ఖురేషి, షేఖ్ ముక్రమ్ లు కలిసి నీతో మాట్లాడేది ఉందని ఈ నెల తేది 12 న తాజుద్దీన్ ను మోటార్ సైకిల్ పై మధ్యలో కూర్చుండ బెట్టుకుని చెన్నారెడ్డి కాలని పక్కన గల చెరుకు తోటకు తీసుకెళ్లారు. తాజుద్దీన్ చేతులను హాసన్, ముఖ్రం లు తాడుతో కట్టేసి, వెంట తెచ్చుకున్న కత్తితో మెడపై బలంగా నరికారు. తీవ్రంగా గాయాలపాలై చనిపోయిన తాజుద్దీన్ ను హాసన్, ముక్రం, అక్బర్ లు మృతదేహాన్ని కారులో తీసుకెళ్ళి బావిలో వేశారు. తేది 13 ఆదివారం ఉదయం జహీరాబాద్ పోలీసు స్టేషన్ కు వచ్చి తాము చేసిన హత్య నేరం వివరాలు పోలీసులకు చెప్పి లొంగిపోయారు. వీరి ద్వారా పూర్తి సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి హత్య కేసు నమోదు చేశారు. నేరస్థుల నుండి ఒక కారు, 3 సైకిల్ మోటార్లు, కమ్మకత్తి, 3 సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు డిఎస్పీ వివరాలు వెల్లడించారు.

# ఎమ్మెల్యే పల్లాను పరామర్శించిన జర్నలిస్టులు

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. పరామర్శించిన వారిలో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన చంద్రారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా చేర్యాల అధ్యక్షుడు కడుదూరి మహేందర్ రెడ్డి, జర్నలిస్టులు తాళ్లపల్లి రాజు, మలిపెద్ది బాలలింగం, బేజాడి అంజిరెడ్డి, ఆర్. నవీన్, అశోక్ రాజు, ఎం. నాగరాజు, నందు, శ్రీనివాస్, లింగం తదితరులు ఉన్నారు.





# చిలిపిచెడు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**సిద్దిపేట టైమ్స్ మెదక్ ప్రతినిధి జూలై 14 :**

సోమవారం కలెక్టర్ చిలిపిచేడు మండలంలో విస్తృతంగా పర్యటించి ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించారు. ధరల పట్టికలను పరిశీ లించారు. రైతులను విత్తన ధరలపై అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండెంట్ ఆధారంగా అవసరానికి తగ్గట్టుగా ప్రభుత్వం ఎరువులు పురుగు మందులు సరఫరా చేస్తుందని చెప్పారు జిల్లావ్యాప్తంగా ఎరువులు పురుగు మందులు కొరత ఎక్కడ లేదన్నారు యూరియా మరియు ఇతర ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. రైతులందరికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడిన పక్షంలో సమస్యను పరిష్కరిస్తూ కొత్త సమస్యలు పునరావృతం. కాకుండా చర్యలు చేపట్టామన్నారు. వానాకాలంలో పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేయడం జరిగిందని, తెలిపారు వర్షాకాలం పంటలను జిల్లాలో సమృద్ధిగా పండించుకుని రైతు కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నేటి వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం ప్రారంభం





**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్ :**

మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని శ్రీ అలివేలుమంగ పద్మావతి వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం మంగళవారం పాలమవుతున్నాయని దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ ఆది శివరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం దౌల్తాబాద్ శ్రీ వెంకటేశ్వర దేవాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

**డాక్టర్ జల్లిపల్లి బ్రహ్మం ప్రవచనం...**

శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు స్వామి సుందర చైతన్య ఆశ్రమ యూత్ సభ్యుడు డాక్టర్ జల్లిపల్లి బ్రహ్మం ద్వారా ప్రవచనం జరుగుతుందన్నారు. ఈ ప్రవచనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలేకం సభ్యులు విజ్ఞప్తి చేశారు.



# ఆషాడ మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు





**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:**

ఆషాడ మాసం పురస్కరించుకొని మండల కేంద్రమైన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ధర్మశాలలో అమ్మవారికి ప్రకృతి వాసవి మాత అమ్మవారికి పకృతి అందించిన పలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ్యులు మాట్లాడుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగిందన్నారు అందులో భాగంగానే గోరింటాకు అమ్మవారి సన్నిధానంలో లలిత సహస్రనామం , భగవద్గీత పారాయణ కుంకుమార్చన తో పాటు మొదలగు కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు .వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను సమర్పించడం జరిగిందని ఆర్యవైశ్య సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం గంప రవి గుప్తా, సముద్రాల శ్రీశైలం గుప్తా, పబ్బ అశోక్ గుప్తా, పసుపునూరి ఆంజనేయులు గుప్తా, శ్రీరామ్ శ్రీరామ్ చంద్రం గుప్తా జిల్లా శ్రీనివాస గుప్తా , గోపిశెట్టి శ్రీనివాస్ గుప్తా, పప్పు మాధవి, పసునూరి పద్మ, గోపిశెట్టి విజయ, శ్రీరామ్ అరుణాదేవి, మానస తోపాటు తదితరులు పాల్గొన్నారు







## సంక్షేమ హాస్టల్లో కోడిగుడ్ల సరఫరాపై అధికారులతో సమీక్ష సమావేశం

**-కలెక్టర్ రాహుల్ రాజ్**

సిద్దిపేట్ టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి జులై 14: సంక్షేమ హస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్ కేజీ. బీవీ.లు అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన కోడిగుడ్ల సరఫరాం గురించి ప్రభుత్వం G.0 no. 16 dt.03.07.2025 విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం ప్రజావాణి అనంతరం వివిధ సంక్షేమ పాఠశాలల్లో కోడిగుడ్ల సరఫరా ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ , పై వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో సంక్షేమ హస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్ కేజీ.బీవీ.లు అంగన్వాడీ కేంద్రాలలో 1184 ఉన్నాయని,79029 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారని. ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి నాణ్యమైన కోడిగుడ్ల సరఫరా ఈ మొత్తం ప్రక్రియ. ఆన్లైన "టెండర్ విధానం ద్వారా కలెక్టర్ /చైర్మన్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా అన్ని రకాల రెసిడెన్షిల్స్ పాఠశాలల్లో ఆర్ సి ఓ లు,/డి సి ఓ లు డిపార్ట్మెంట్ హెచ్వోడీస్ , జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, .AGMARK Representative , జిల్లా సమాచార అధికారి సభ్యులు ఉంటారన్నారు. ఈ టెండర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు HOD'S అందరు పక్కగా టెండర్ విధానంలో కొనుగోలుకు సిద్ధంగా ఉండవలసిందిగా, నాణ్యమైన భోఖం విద్యార్థులది అందేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు సంబంధిత ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎరువులు ,విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలి



**-మండల వ్యవసాయ అధికారి నరేష్...**

**సిద్ధిపేట టైమ్స్ దౌల్తాబాద్ :**

ఫర్టిలైజర్ దుకాణ యజమానులు రైతులకు విత్తనాలు ఎరువులు ఎమ్మార్పీ ధరలకంటే అధిక ధరలకు విక్రయించరాదని ఒకవేళ విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణదారుల యజమానులకు విత్తన చట్టం మరియు నియమ నిబంధనలు గురించి వివరించటం జరిగిందన్నారు. ప్రతీ రైతుకు ప్రతీ డీలర్ కచ్చితంగా బిల్లు ఇవ్వాలన్నారు. అదే విధంగా స్టాక్ వివరాలను, ధరల పట్టికలను ప్రతి డీలర్ షాపు నందు ఉంచాలన్నారు. స్టాక్ రిజిస్టర్ లు , బిల్ బుక్ లు ప్రతి రోజు వారిగా రాయాలని సూచించారు. అదే విధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ రేటుకు మించి అమ్మిన, కాలం గడిచిన విత్తనాలు, పురుగు మందులు అమ్మిన విత్తన చట్టం మరియు పురుగు మందుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్స్ దగ్గరే విత్తనాలు కొనుగోలు చెయ్యాలని, గ్రామాలలో తిరిగి అమ్మే లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద కొనుగోలు చెయ్యవద్దన్నారు. అదే విధంగా రైతులు ఖచ్చితంగా బిల్ తీసుకొని దానిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు, ఫర్టిలైజర్ దుకణాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట జూలై 14 :**

నిజాంపేట మండల పరిధిలోని చల్మడ గ్రామానికి చెందిన చిట్టే యశోద (55) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం మరణించడం జరిగింది. ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చప్పట ముత్యంరెడ్డి కుటుంబం యొక్క పేద స్థితిని గమనించి వారి కుటుంబ సభ్యులకు సోమవారం నాడు 5000 రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. వారి కుటుంబానికి ఎల్లవేళలా సహాయంగా ఉంటానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమలనాథ స్వామి ఆలయ డైరెక్టర్ బాజా రమేష్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మెన మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, బొమ్మెన కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు ఇవ్వాలని ఆందోళన



**- ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయింపు**

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేర్యాల ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరి అయిన వారు ఎంపిడిఓ కార్యాలయం కు వచ్చి సోమవారం పట్టాలు పొందాలని గ్రామ కార్యదర్శుల ద్వారా గ్రామాలలో సమాచారం ఇచ్చారని దానిని ఆధారం చేసుకుని తాము పత్రాల కోసం వస్తే తరువాత ఇస్తామని చెప్పడంతో ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ వారు మంజూరీ చేయని గ్రామాలలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కృషితో తమకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని అలాంటి పరిస్థితుల్లో గ్రామాలలో ప్రజలకు సమాచారం ఇచ్చి నేడు పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని వారు కార్యాలయం ముందు బైఠాయించి ఐదు గంటలు నిరసన తెలిపారు. అందులో భాగంగానే మధ్యాహ్న భోజన కార్యక్రమం కార్యాలయం ముందు చేశారు. తమకు ఇండ్ల పత్రాలు ఇవ్వకుండా ఆపిన వారు ఎవరో తమకు తెలపాలని అధికారులను నిలదీశారు. దీంతో ఎంపీడీవో మహబూబ్ అలీ జిల్లా అధికారులతో మాట్లాడి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులు పత్రాలను తీసుకోవాలని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమింప చేశారు. నిరసన చేస్తున్నారని విషయం తెలియడంతో బిఆర్ఎస్ నాయకులు వారికి సంఘీభావం తెలుపుతూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలతో పాటు టిఆర్ఎస్ నాయకులు ఉల్లంపల్లి కరుణాకర్, అనంతుల మల్లేశం, గదరాజు చందు, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు, వకుళాభరణం నరసయ్య పంతులు, సుంకరి మల్లేశం, మీసా పార్వతి తదితరులు ఉన్నారు.





## ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, జులై 14:**

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. నంగునూరు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం పనులు జోరందుకున్నాయి. నంగునూరు మండలంలోని నంగునూరు పాలమాకుల గ్రామాలలో సోమవారం టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి చ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో రెండు పడక గదుల ఇళ్ళు నిర్మించి ఇస్తామని గత ప్రభుత్వం నమ్మించి నిరుపేదలను మోసం చేసిందన్నారు. గత పదేండ్ల పాలనలో ఇండ్లు లేని పేదల నిరుపేదలకు, ఇందిరమ్మ ఇండ్ల పథకం వరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో చెలికాని యాదగిరి, గౌరబోయిన సంపత్ కుమార్, కరెడ్ల వెంకట్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, దాసరి కిషన్, తుపాకుల శ్రీనివాస్,సాదుల పవన్, భాస్వరాజు రాములు,చేర్యాల బాలయ్య, రాగుల కనకయ్య, శివరాత్రి తిరుపతి,రంజిత్ గౌడ్,దుద్దెడ రాములు, వర్ధోళ్ల సాగర్, బోగి శ్రీనివాస్,బండి ఎల్లయ్య,చిన్న బాబు శిరీష,రంగు రాజు, కొంక రాములు పాల్గొన్నారు.



## బీజేపీ, మోడీ ఆంగ్ల అక్షరాల రూపంలో వరి నారు..



**- అభిమానాన్ని చాటుకున్న బీజేపీ నేత వాసరి యాదమల్లు..**

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, జులై 14:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వాసరి యాదమల్లు తన వ్యవసాయ క్షేత్రంలో వరి నారును బీజేపీ,మోడీ ఆంగ్ల అక్షరాల ఆకారంలో పెంచారు. ఈ నారు చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇటీవల ఆపరేషన్ సింధూర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపిన సమయంలో జన్మించిన తన మనవరాలికి సింధూర అని పేరు పెట్టి తన దేశభక్తి చాటుకున్న విషయం తెలిసిందే. ప్రతి విషయంలో దేశభక్తి చాటుకునే వాసరి యాదమల్లు బీజేపీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కొనసాగుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించినా వెళ్ళలేదు. గ్రామంలో వ్యవసాయం చేసుకునే వాసరి యాదమల్లు బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీని అభిమానిస్తారు. తన అభిమానాన్ని సాగులోనూ చూపించారు. వరి నాట్లు వేసేందుకు పెంచిన నారును బీజేపీ, మోడీ ఆంగ్ల అక్షరాలు రూపంలో పెంచి తన అభిమానాన్ని చాటుకున్నారు.



## కేంద్ర బృందానికి వివరాలను
# క్షేత్రస్థాయిలో అంధిచాలి..

**- జిల్లా కలెక్టర్ కే. హైమావతి..**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ప్రతినిధి; జులై 14 :**

జిల్లా పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందానికి అందుబాటులో ఉండి వివరాలను క్షేత్రస్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన పథకాల పరిశీలనకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జోసెఫ్ మరియు వినోద్ ల నేతృత్వంలో జిల్లాకు వచ్చిన బృందం సభ్యులు సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కే. హేమావతి తో సమావేశమయ్యి జిల్లాలో వారు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాల్సిన వివిధ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ పంపించిన బృందం నేటి నుండి ఈ నెల 24వ తేదీ వరకు జిల్లాలోని బెజ్జంకి, అక్కన్నపేట, కొమరవెల్లి మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంఎన్ఆర్ఇజిఎస్, పింఛన్లు, వాటర్ షెడ్, గ్రామీణ సడక్ యోజన, పీఎం ఆవాస్ యోజన, గ్రామపంచాయతీలు, అర్సేటి తదితర 12 రకాల పథకాల అమలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి కేంద్ర ప్రభుత్వ గ్రామీణభివృద్ధి శాఖకు అందజేస్తారని ఆయా మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఏపీవోలు సంబంధిత ఇతర అధికారులు అందుబాటులో ఉండి జిల్లాలో అమలవుతున్న సంబంధిత పథకాలను క్షేత్రస్థాయిలో చూపించి వివరాలను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ అమీద్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, పిడి హౌసింగ్ దామోదర్ రావు, ఎల్డిఎం హరిబాబు, పంచాయతీరాజ్ ఇఇ లు చిరంజీవి, శ్రీనివాస్ రెడ్డి, డిపిఓ దేవకీదేవి, డివిజనల్ పంచాయతీ అధికారులు, డిఆర్డిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు






## గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారం
# వేగవంతం కావాలి

**- ప్రజావాణిలో 66 దరఖాస్తుల స్వీకరణ**
**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి జూలై 14:**

ప్రజావాణి లో వచ్చే దరఖాస్తు లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని *జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా *అదనపు కలెక్టర్ నగేష్, తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... ఒకే సమస్య పైన పలు మార్లు వినతిని సమర్పించకుండా... ఎప్పటికప్పుడు గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తు లకు సంబందించి క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి కాగానే...తీసుకున్న నిర్ణయన్ని సదరు వ్యక్తి కి సమాచారాన్ని చేరవేయాలన్నారు లేనిచో మళ్ళీ అదే సమస్య పైన వినతి సమర్పించేందుకు గ్రీవెన్స్ కి ప్రజలు రావలిసిన అవసరం ఏర్పడు తుందన్నారు.. పదే పదే గ్రీవెన్స్ కి వచ్చి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని... వారి సమస్య పరిష్కారం జరిగే తీరును వివరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు ఈరోజు ప్రజావాణిలో భూ సమస్యల 14 , పింఛన్లు07, ఇందిరమ్మ ఇండ్లు06 ఇతర సమస్యలు 39 మొత్తం 66 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు




## హబ్షి పూర్ యంజెబి గురుకులానికి
# స్వంత భవనం నిర్మిస్తాం.

**- రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి హామీ.**

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక జూలై 14 :**

మండలం హబ్షిపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు స్థలం కెటాయిస్తే స్వంత భవనాన్ని నిర్మిస్తామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ధర్,గురుకుల విద్యాలయాల కార్యదర్శి సైదులు లు హమీఇచ్చారు.సోమవారం నాడు డాక్టర్ అంబేద్కర్ సచివాలయం లో రాషయ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి_శ్రీధర్,మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులలతో సమావేశమై హబ్షిపూర్ యంజెబి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పై చర్చించారు. అధికారులు సానుకూలంగా స్పందించారు.సమస్యలను దశల వారిగా పరిష్కారం చెస్తామని జిల్లా ప్రస్తుత స్టెడియాన్ని, స్థలాన్ని బిసి సంక్షేమ శాఖకు కేటాయి స్తే స్వంత భవనం నిర్మిస్తామని హమి ఇచ్చారు.ఈ సమావేశంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీల పరిష్కారానికి
# ప్రాధాన్యత నివ్వాలి..



**- జిల్లా కలెక్టర్ కే. హైమావతి..**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ప్రతనిధి, జూలై 14 :**

ప్రజావాణి ఆర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసి లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు లోకల్ బాడీస్ గరిమా అగ్రవాల్, అదనపు కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్ లతో కలిసి ప్రజలండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమానికి 253 అర్జీలు వచ్చినాయి. అంతకుముందు జిల్లా అధికారులతో నిర్వహించిన రివ్యూలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి కచ్చితంగా వారం రోజుల్లోగా పరిష్కరించలన్నారు. అలాగే శనివారంలోగా దరఖాస్తులను ఆన్లైన్లో పొందుపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అధికంగా యూరియా
# వాడితే భారీ నష్టం

**-మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్.**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్ :**

రైతులు పంటలకు అవసరానికి మించి యూరియాను వాడితే భూమి సారవంతం కోల్పోతుందని దాని ద్వారా భూ కాలుష్యం ఏర్పడుతుందని రాయపోల్ మండలా వ్యవసాయ అధికారి రాసాల నరేష్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల పరిధిలోని తిమ్మక్ పల్లి గ్రామ రైతులకు యూరియా అధికంగా వాడటం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రైతులు వ్యవసాయం సాగులో పంటలకు యూరియాను అధికంగా వాడుతున్నారు. యూరియా అధికంగా వాడడం వలన నేల కాలుష్యం ఏర్పడుతుంది.యూరియాను అవసరానికి మించి వాడితే భూమి నిస్సారం అవుతుందన్నారు. యూరియా అతిగా వాడితే మొక్కలు పేలుసు బారి చీడ పీడల పెరుగుతుందన్నారు. యూరియా అధికంగా వాడటం వలన నేలలో ఉండి పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు తగ్గిపోతాయాన్నారు.యూరియా ఆమ్లా స్వభావం కలిగి ఉంటుంది దీని వలన యూరియా అధికంగా వాడటం వలన భూములు ఆమ్ల నేలలుగా మారుతాయన్నారు. యూరియాకు బదులు నానో యూరియా వాడకం గురించి రైతులకు వివరించటం జరిగిందన్నారు.యూరియా వేసిన తరువాత పంటలకు 30 నుంచి 35 శాతం వరకే మొక్కలకు అందుతుంది.

మిగతాది గాలిలోకి ఆవిరి రూపంలో, భూ పొరలలోకి , భూగర్బ జలాల్లో కలిసిపోతుంది. కానీ నానో యూరియా అనేది పంట ఆకుల పైన స్ప్రే చేయడం ద్వారా 80 నుంచి 90 శాతం పంట పొలానికి ఉపయోగపడుతుందన్నారు.b ఒక హాఫ్ లీటర్ నానో యూరియా ఒక 45 కేజీల బ్యాగ్ తో సమానం. ఒక హాఫ్ లీటర్ నానో యూరియా ధర రూ. 205 మాత్రమే. ఒక హాఫ్ లీటర్ నానో యూరియా ఒక ఎకరాకు సరిపోతుంది. 25 రోజుల లోపు పంట పొలానికి 2 మీ.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. 25 రోజుల దాటిన పంట పొలానికి 4 నుంచి 5 మీ.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఇలా యూరియాకు బదులు నానో యూరియాను వాడి పంటలను, నేలను రక్షించుకోవాలని రైతులకు వివరించారు.

## సమాచారం లేకుండా అధికారులు
# మార్కింగ్ చేశారు..

**- కలెక్టర్ కు మొరపెట్టుకున్న పెద్ద గుండవెల్లి గ్రామస్తులు..**

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక, జూలై 14:**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన 40 మంది గ్రామస్తులు రోడ్డు వెడల్పులో మాకు సమాచారం లేకుండా ఆర్అండ్ బి అధికారులు మార్కింగ్ చేసి వెళ్లినారని స్థానిక జిల్లా కలెక్టర్ కె ఐమావతికి మొరపెట్టుకున్నారు. గత పది సంవత్సరాల నుండి ఇదే తతంగం జరుగుతుందని, మా గ్రామానికి వచ్చి ఇండ్లు పోయేవారికి న్యాయం చేసే విధంగా ఉండాలని ఉద్దేశంతో కలెక్టర్ ను కలవడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. లేని పక్షంలో ఎటువంటి ఆందోళనకైనా మేము సిద్ధమని ముక్తకంఠంతో పెద్ద గుండవెల్లి గ్రామస్తులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇండ్లు కోల్పోయే బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.



## నానో యూరియాతో తక్కువ ఖర్చుతో పంటల అధిక దిగుబడులు

**- ఇంచార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ**

**సిద్దిపేట టైమ్స్ రామాయంపేట జూలై 14 :**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పంటల్లో నానో యూరియా వాడాల్సిందిగా ఆదేశించిన మేరకు గౌరవ జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో వ్యవసాయ శాఖ నానో యూరియా వాడకంపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా ఆదేశించిన నేపథ్యంలో ఈరోజు రామయంపేట మండల పరిధిలో రామయంపేట పట్టణ శివారులో పోచమల్ల రమేష్ క్షేత్రంలో వరి పంటపై పై నానో యూరియా వాడకంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజనారాయణ మాట్లాడుతూ నానో యూరియా ఒక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినటువంటి ప్రత్యేక రకమైన ద్రవరూప ఎరువు ఇది ముఖ్యంగా సాంప్రదాయంగా గుళికల రూపంలో వాడుతున్నటువంటి యూరియాతో పోలిస్తే తక్కువ ధర మరియు పనితనం చాలా రెట్లు ఎక్కువ ఉన్న నేపథ్యంలో రైతులకు ఈ నానో యూరియా వాడకంపై విస్తృతంగా వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ముఖ్యంగా నానో యూరియా అనేది ద్రవరూపంలో ఉన్నటువంటి ఎరువు దీన్ని పిచికారి చేయడం ద్వారా పత్ర రంధ్రాల ద్వారా నేరుగా మొక్కలోకి వెళుతుంది సాంప్రదాయ పద్ధతిలో యూరియాను వెదజల్లడం ద్వారా నీటిలో కరిగి చాలావరకు వృధా అవుతుంది. అదే విధంగా కొంతమేరకు గాలిలో ఆవిరి రూపంలో వృధా అవుతుంది. తద్వారా రైతుకు తాను వేసిన ఎరువులో కేవలం 30 నుండి 40 శాతం ఎరువు మాత్రమే మొక్క వేర్ల ద్వారా శోషిస్తుంది దీని ద్వారా రైతుకు ఎరువులు వృధా అవ్వడంతో పాటుగా అదనపు ఖర్చు అవుతుంది అదేవిధంగా నేలలో మోతాదుకు మించి ఎరువులు వాడడం ద్వారా కాలుష్యం ఏర్పడుతుంది వీటన్నిటికీ పరిష్కారంగా నూతన సాంకేతిక విధానం అయినటువంటి నానో టెక్నాలజీ ద్వారా రూపొందించినటువంటి నానో యూరియా వాడకం వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుంది దీని ధర కేవలం 225 రూపాయలు మాత్రమే ఎకరాకు 500 మిల్లీలీటర్ల నాను ఎరువు ఒక దఫా పిచికారికి సరిపోతుంది ఈ 500 మిల్లీలీటర్ల నానో ఎరువు ఒక బస్తా సాంప్రదాయ పద్ధతిలో ఉన్నటువంటి యూరియా కు సమానం, దీన్ని పిచికారి చేసుకోవడం అతి సులువు కేవలం 500 మిల్లీలీటర్ల నానో యూరియా ప్లాస్టిక్ బాటిల్ ను అతి సులువుగా పొలం కు తీసుకెళ్లవచ్చు ఈ నానో యూరియాలో మిగతా పురుగు మందులతో కలిపి పిచికారి చేసుకునే సౌలభ్యం కూడా కలదు నానో యూరియాను పంటలపై పిచికారి చేసినప్పుడు ఈ ద్రావణం 90 శాతం వరకు మొక్కలలోకి వెళ్లడం ద్వారా సమర్థవంతంగా పనిచేసే మొక్కల యొక్క దిగుబడిలో ప్రధాన పాత్ర పోషిస్తుంది కావున రైతులు తప్పనిసరిగా తమ పంట కాలంలో ఒకసారి తప్పనిసరిగా నానో యూరియాను వాడాల్సిందిగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం ఈ కార్యక్రమంలో వ్యవసాయం అధికారి ప్రవీణ్ కుమార్ తో పాటుగా రైతులు పాల్గొన్నారు .



# మా గోడు పట్టించుకోరా

**- అరితాస్ గోల్డెన్ పార్క్ వాసుల ఆవేదన.**
**- జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు**

సిద్ధిపేట టైమ్స్ తూప్రాన్ /మనోహరాబాద్:

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తూప్రాన్ పట్టణంలో తమ గోడు పట్టించుకోరా అంటూ పట్టణంలోని గోల్డెన్ పార్క్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణం లో అభివృద్ధి పలాలకు నోచుకోని ప్రాణమే హరితాస్ గోల్డెన్ పార్క్ అని ఆ కాలనీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళి గౌడ్ రమేష్ చారి ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీ లో వసతులు కల్పించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి లో వినతి పత్రం అందచేశారు. తమ కాలనీలో కనీస వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురికి నీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధాన్ని వెదజల్లుతూ అనేక రోగాలకు కారణమైన దోమలు ఈగలకు నిలియంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల కిరువైపున పిచ్చి మొక్కలు పెరిగి పాములు, తేలు లాంటి ఇతర విషపురుగులకు స్థావరాలయ్యాయని రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాలను శుభ్రం చేసే వారే లేరని ఆపోయారు. తూప్రాన్ మొత్తంగా సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం జరిగినా కానీ మా కాలనీని పట్టించుకోవడంలేదని, మా కాలనీ వాసుల ఓట్లు, ఇంటి టాక్స్ కావాలి కానీ కనీస వసతులు కల్పించడం పై దృష్టి పెట్టలేదని తమ కాలనీలో నెలకొన్న సమస్యలపై గతంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ కు, జిల్లా కేంద్రంలో కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణిలో పిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. కలెక్టర్ స్పందించి తమ కాలనీ వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఉపాధ్యక్షులు యాదగిరి,సతీష్, గోపాల్, సాయిబాబా,స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో గిరిజన సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయాలి

**-నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేత**

**సిద్దిపేట టైమ్స్ సిద్దిపేట అర్బన్, జూలై 14:**

సిద్ధిపేట జిల్లాలో గిరిజన సంక్షేమ కార్యాలయం లేకపోవడం వలన క్షేత్రస్థాయిలో గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడం లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎన్ టి ఎఫ్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ ఎల్లం తో కలిసి సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ లో గిరిజన సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు గడిచిన నేటి వరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయలేదన్నారు.



# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

సిద్ధిపేట టైమ్స్, సిద్ధిపేట ప్రతినిధి; జూలై 14 :

దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిద్ధిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ దేవాదాయ శాఖ అధికారులకు, అర్చకులకు సూచించారు. సోమవారం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పట్లోళ్ల విజయలక్ష్మి తో పాటు శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం, నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల అర్చకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా గరిమా అగర్వాల్ మాట్లాడుతూ దేవాలయాల్లో కావలసిన అవసరాలను సమకూర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, స్థానాచార్యులు మల్లయ్య స్వామి, అర్చకులు మనోహర్, బసవేశ్వర్, తిగుల గోపికృష్ణ తదితరులు ఉన్నారు

# సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి..

**- మంద పవన్,సీపీఐ జిల్లా కార్యదర్శి,సిద్దిపేట**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట జూలై 14 :**




ఈ నెల 16 న హుస్నాబాద్ లో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సిద్దిపేట జిల్లా 4వ మహాసభలు జరగనున్నాయని,ఈ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ఒక ప్రకటనలో తెలిపారు.. సోమవారం రోజున ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి మహాసభలు జరుపుకుంటామని అందులో భాగంగా సిపిఐ సిద్దిపేట జిల్లా 4వ మహాసభలు హుస్నాబాద్ లో జరగనున్నాయని, ఈ నెల 16న మహాసభల సందర్భంగా హుస్నాబాద్ లో అంబేద్కర్ చౌరస్తానుండి కెజెఆర్ గార్డెన్ వరకు పార్టీ కార్యకర్తలతో ప్రదర్శన ర్యాలీ జరుగుతుందని,అనంతరం మహాసభ ను నిర్వహించుకుంటామని తెలిపారు..ఈ మహాసభలకు ముఖ్య అతిథిలుగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ,జాతీయ కార్యవర్గ సభ్యులుచాడ వెంకట రెడ్డి ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ హాజరవుతారన్నారు ..ఈ మహాసభలలో పార్టీ నిర్మాణం, బలోపేతం కోసం, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన చేస్తామని,నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని ఆయన తెలిపారు..ఈ మహాసభలలో ప్రజలు,మేధావులు, ప్రజా సంఘాల నాయకులు,,పార్టీ సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు..

# భార్యాభర్తల గొడవలో పాప మృతి

**సిద్దిపేట టైమ్స్ శివంపేట్ :**

భోజనం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలో చిన్నారి జారిపడి మృతి చెందిన సంఘటన శివ్వంపేటలో చోటుచేసుకుంది. శివ్వంపేట ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేట గ్రామానికి చెందిన కుంట మహేష్, లావణ్య దంపతులు, ఇద్దరు కూతుర్లు చైత్ర, ఆకాంక్ష ఉన్నారు. ఈ నెల 5న మధ్యాహ్నం మహేష్ పని ముగించుకొని ఇంటికి వచ్చి భార్య లావణ్యను భోజనం పెట్టాలని అడగగా చిన్నపాప ఏడుస్తుందని నువ్వే పెట్టుకొని తినమని చెప్పగా భర్త భార్యతో గొడవపడి తోపులాట జరిగింది. భార్య చేతిలో ఉన్న 11నెలల చిన్న కూతురు ఆకాంక్ష అకస్మాత్తుగా జారి కింద పడింది. భార్యాభర్తలు ఇద్దరు కలిసి అపస్మారక స్థితిలో ఉన్న ఆకాంక్ష తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం లకిడికాపూల్ లోని నిలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు చికిత్స పొందుతూ సోమవారం బాలిక మృతి చెందిందని భార్య ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు కింద పడి చిన్నారి మృతిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## రేవంత్ రెడ్డికి బేషన్స్ కాదు

# బేసిక్స్ కుడా లేవు

**- సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, బిఆర్ఎస్ నాయకులు శ్రీహరి యాదవ్..**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట జూలై 14 :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బేషన్సే కాదు బేసిక్స్ కూడా తెలియదని సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, బి ఆర్ ఎస్ నాయకులు శ్రీహరి యాదవ్, కోల రమేష్ గౌడ్ అన్నారు. మండుటెండల్లో సైతం బిఆర్ఎస్ ప్రభుత్వం మత్తల్లు దూకిపిస్తే.. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎడారిలా మారుస్తుందని ఆరోపించారు.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. తెలంగాణ సమాజం పట్ల, నీటి వసతుల పట్ల కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అన్నారు. రైతు ప్రయోజనాలను ఫణంగా పెడితే బి ఆర్ ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని.. కల్లపల్లి పంప్ హౌస్ వద్ద నీటి ఎత్తిపోతలు ప్రారంభించి రైతులకు నీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఏ రోజు కూడా రైతు మొగులుకు ముఖం పెట్టి చూడలేదని ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రైతు వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు..కనీసం రైతులకు సరిపడా యూరియా కూడా అందించడం లేదని...... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎరువుల ధరను పెంచి రైతుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు.. రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపిలు ఒకరికి ఒకరు రక్షణ కవచంలా నిలుస్తున్నాయని అన్నారు. ఎప్పటికైనా రైతులకు రక్షణ కల్పించి రైతు సంక్షేమ పాలన కొనసాగించేది బిఆర్ఎస్ పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలకు దగ్గరగా వస్తున్న ఇప్పటివరకు మార్కెట్ కమిటీ చైర్మన్ కూడా నియమించకపోవడం రైతుల పట్ల కాంగ్రెస్కు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. కెసిఆర్, హరీష్ రావుల నేతృత్వంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. తెలంగాణ ప్రాంతంపై, ప్రజలపై ఆంధ్ర నాయకుల అవహేళనలు ఎక్కువయ్యాయని.. వీటిని మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వం రైతులకు నీరు అందించాలని లేనిపక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకత్వంలో మోటర్లు ఆన్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం కుర్చీ కాపాడుకోవడం గురించి ఆలోచించడం మాని ప్రజా పాలనపై దృష్టి సారించాలని హితువు పలికారు. ఈ మీడియా సమావేశంలో నంగునూర్ మండల పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్, కౌన్సిలర్ సుందర్,నాయకులు మొహీజ్,ఎల్లయ్య,బాబు,సతీష్, ఆకుబత్తిని, రాము, గోరేమియా పలువురు పాల్గొన్నారు.

# ట్రైనీ లైసెన్స్ సర్వేయర్ల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి..

**- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ప్రతినిధి; జూలై 14 :**



ట్రైనీ లైసెన్స్ సర్వేయర్ల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా మే 26వ తేదీ నుండి జులై 26 వరకు సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న ట్రైని లైసెన్సుడ్ సర్వేయర్స్ కు ఈనెల 27 మరియు 28వ తేదీలలో సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అందుకు సంబంధిత అధికారులు అన్ని సిద్ధం చేయాలని సూచించారు. 27న ఉదయం 10:00 గంటల నుంచి 1:00 వరకు, మరియు 2:00 గంటల నుండి 5:00 గంటల వరకు 28వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ వినయ్ కుమార్, డిపిఓ దేవకీదేవి, మున్సిపల్ అధికారులు, ఎస్ఇ ఎలక్ట్రిసిటీ, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ మరియు వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు





**- పేదలకు వరమైన ఇందిరమ్మ ఇండ్ల పథకం**

**- టీపీసీసీ కార్యదర్శి, దేవులపల్లి యాదగిరి**

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు జూలై 14 :**

నంగునూర్ మండలం లో దేవులపల్లి యాదన్న చేతుల మీదుగా జోరుగా ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలు జరిగాయి. నంగునూర్ మండల కేంద్రం తో పాటు పాలమాకుల గ్రామం లో ఈ రోజు ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు.డబులు బెడ్ రూములు ఇస్తామని నమ్మించి మోసం చేసి కెసిఆర్, పదేండ్ల పాలనలో ఇండ్లు లేని పేదల నిరుపేదలకు, ఇందిరమ్మ ఇండ్ల పథకం వరంగా మారిందన్నారు. ఇంత మంచి పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో చెలికాని యాదగిరి, గౌరబోయిన సంపత్ కుమార్, కరెడ్ల వెంకట్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, దాసరి కిషన్, తుపాకుల శ్రీనివాస్, సాదుల పవన్,భాస్వరాజు రాములు, చేర్యాల బాలయ్య, రాగుల కనకయ్య, శివరాత్రి తిరుపతి,రంజిత్ గౌడ్, దుద్దెడ రాములు, వర్ధోళ్లు సాగర్, బోగి శ్రీనివాస్, బండి ఎల్లయ్య, చిన్న బాబు శిరీష,రంగు రాజు, కొంక రాము ,లు పాల్గొన్నారు.

# సాకు చెరువు కట్టపై బీటీ రోడ్డు నిర్మించాలి

**- మిషన్ భగీరథ నీళ్లు రాక బీసీ కాలనీ ప్రజల ఇబ్బందులు**

**- ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేత**

**- రేణుక మాత ఆలయ చైర్మన్ ఎల్పుల మహేష్**

**సిద్దిపేట టైమ్స్ , దుబ్బాక ప్రతినిధి**

రేణుక మాత ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కాకుండా సాకు చెరువు కట్టపై బీటీ రోడ్డు నిర్మించాలని జిల్లా కలెక్టర్ హైమావతికి సోమవారం రోజున ప్రజావాణి లో భాగంగా రేణుక మాత ఆలయ చైర్మన్ ఎల్పుల మహేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆలయ పరిసర ప్రాంతం బిసి కాలనీలో ఉన్న నేపథ్యంలో నీళ్లు రాక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. గ్రామ ప్రజల సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలని వారు కోరారు. అనంతరం సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గ్రామంలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్ అండ్ బి మరియు ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు డిసైన్ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు కలెక్టర్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# 4 రోజుల్లో సింగూరు నుండి ఘనపూర్ ప్రాజెక్టు కు సాగు నీటిని విడుదల చెయ్యాలి

**- నీటిని విడుదల చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలసి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తాం**

**- మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మ దేవేందర్ రెడ్డి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి జులై 14 :**



సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే. యం. పద్మా దేవేందర్ రెడ్డి.నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి.మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, రైతులు,జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు. ఘనపూర్ ప్రాజెక్టు ఆయకట్టు కు సాగునీటిని విడుదల చేయాలని లేదంటే మెదక్,నర్సాపూర్ నియోజక వర్గాల రైతులతో పెద్ద ఎత్తున మెదక్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని మెదక్ జిల్లా బీఅర్ ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి లు హెచ్చరించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి లో కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు కలెక్టరేట్ ఆవరణలో మీడియా సమావేశంలో మాట్లాడారు.... కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తరువాత రైతుల పరిస్థితి దయానీయం గా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కంట కన్నీళ్లు పెట్టిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాటికి ,సిద్దిపేట, గజ్వేల్,సిరిసిల్లా అంటారు తప్ప ఇక్కడి రైతుల పరిస్థితి పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శించారు.సింగూరులో నీళ్లు ఉన్నపటికీ ఘనపూర్ ప్రాజెక్టు కు 0.4 టీఎంసీలు వాటాగా రావాల్సినవి విడుదల చేయడం లేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం హాయంలో సమయానికి నీళ్లు వదిలిపించామని చెప్పారు. గత పది సంవత్సరాల్లో రైతులు ఎన్నడు రోడ్డెక్కిన పరిస్థితి లేదు అన్నారు. సింగూరు,కాళేశ్వరం జలాలు, కొండపోచమ్మ సాగర్ నుండి హాల్దీ ప్రాజెక్టుకు సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని పక్షాన బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ప్రోటోకాల్ పాటించండి**

నర్సాపూర్ నియోజక వర్గంలో దుబ్బాక నియోజక వర్గం లోని నార్సింగ్,చేగుంట, గజ్వేల్ నియోజక వర్గంలోని తూప్రాన్ మండలాలలో అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యేలను కాదని ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు ఎమ్మెల్యేలు కానీ అధికార పార్టీ ఇన్చార్జీలు నాయకులు చేస్తున్నారని, అధికారులు ప్రోటోకాల్ పాటించండం లేదని కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఎమ్మెల్యేకు ఎస్కార్ట్ ఇవ్వకుండా అధికార పార్టీ నేతలకు పోలీస్ లు ఎస్కార్ట్ ఇస్తున్నారని తీవ్రంగా మండి పడ్డారు. అదేవిధంగా ప్రతి ఒక్క కార్యక్రమంలో ప్రోటోకాల్ విషయంలో సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం జరగకుండా చూడాలని కలెక్టర్ గారిని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, బట్టి. జగపతి, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కొకన్వీనర్ కృష్ణ గౌడ్, లింగారెడ్డి జుబేర్, న్యాయవాది జీవన్రావు, మాజీ కౌన్సిలర్లు జయరాజ్ ఆర్ కె శ్రీనివాస్, మాయ మల్లేశం, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలగౌడ్, మెదక్ నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల మాజీ జడ్పిటిసిలు ఎంపీపీలు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా పదవీ బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అసిఫ్

**సిద్దిపేట టైమ్స్ సిద్దిపేట టౌన్:**

సిద్ధిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా పదవీ బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అసిఫ్ పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వ్ అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల రక్షణకు పెద్దపీట వేయాలని తెలిపారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సీసీ కెమెరాలు గ్రామస్తులు మరియు వ్యాపారస్తులతో కలసి వెంటనే రిపేర్ చేయించాలని సూచించారు. మరియు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. తరచుగా గ్రామాలను సందర్శించాలని తెలిపారు. విపిఓ వ్యవస్థను మరింత మెరుగుపరిచి సూచించారు.

# గ్రామ విపిఓ తో కలిసి తడ్కపల్లి గ్రామాన్ని సందర్శించిన- త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్

**సిద్దిపేట టైమ్స్ సిద్దిపేట టౌన్:**



గ్రామ విపిఓ తో కలిసి తడ్కపల్లి గ్రామాన్ని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు .రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి వాటిని అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలి అని అన్నారు. ప్రజల రక్షణ మరియు సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం అని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖకు సహకరించాలి అని అన్నారు . సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దు అని అన్నారు ప్రజల రక్షణ సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని 24 గంటలు పని చేస్తాయని సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు పెద్దలు వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడలిలో మరియు ఎగ్జిట్ ఎంట్రీ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పనిచేయడం లేదని తెలిపారు. గ్రామంలో ఉన్న యువకులు ఏం చేస్తున్నారు అనేది తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. యువకులు గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులకు ఉంటుందని తెలిపారు. యువకులు ఏదైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా నాటు సారాయి తయారు చేయవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులము రుణమాఫీ అయిందని కేవైసీ అప్డేట్ చేయాలని కారణాలతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తారు, ఎవ్వరు కూడా బ్యాంకు వివరాలు మీ పర్సనల్ డాటా ను షేర్ చేయవద్దని సూచించారు. రుణమాఫీ విషయంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆన్లైన్ మోసాల బారిన ఎవరు కూడా పడవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ హైల్ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్ నడపవద్దని సూచించారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే మరియు ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవల అందిస్తామని తెలిపారు. ప్రజల ధన మాన ప్రాణ రక్షణకు డిపార్ట్మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుంని భరోసా కల్పించారు.

# వంగ భూంరెడ్డి మృతికి కొమ్మూరి సంతాపం



**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

చేర్యాల పట్టణ మహిళా అధ్యక్షురాలు వంగ జయ మామ వంగ భూమిరెడ్డి సోమవారం మృతి చెందడంతో జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి మృతుని స్వగ్రామమైన కొమురవెల్లి మండలం మర్రిముచ్చల గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మంజే మల్లేశం, కొమ్ము రవి, దాసరి శ్రీకాంత్, బందిగా రాకేష్కృష్ణన్, వంగ కృష్ణారెడ్డి, రాగుల శ్రీనివాస్ రెడ్డి, ముస్త్యాల యాదగిరి, కాశెట్టి ఉపేందర్, పిల్లి విజయ్, భూమని బాలరాజు, తాటికొండ సదానందం, జంగని రవి, ఎండి ఖలీమ్ పాషా తదితరులు ఉన్నారు.

# లోహిత్ సాయి హాస్పిటల్ పైన చర్యలు తీసుకోవాలి

**- సిద్దిపేట కలెక్టర్ కు వినతి బీఎస్పీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్**

సిద్ధిపేట టైమ్స్, సిద్ధిపేట; జూలై 14 :

బహుజన్ సమాజ్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో లోహిత్ సాయి హాస్పిటల్ పైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్ధిపేట పట్టణంలోనీ గత కొంతకాలంగా లోహిత్ సాయి హాస్పిటల్లో ట్రీట్మెంట్ సరిగా ఇవ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతు పైసలకు కక్కృతి పడుతు హాస్పిటల్ పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. మొన్న సిద్ధిపేట పట్టణానికి చెందిన అహ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్ అనే వ్యక్తి నడుచుకుంటూ హాస్పిటల్ కి రాగా అపెండెక్స్ అని చెప్పి డాక్టర్లు ఆపరేషన్ థియేటర్ కి తీసుకెళ్లి మళ్ళీ బీపీ ఎక్కువ అయింది ఎమర్జెన్సీ ఉందని చెప్పేసి హైదరాబాద్కు రిఫరీ చేయగా అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మరణించడం జరిగింది. ఇదే విషయమై ఆసుపత్రి సిబ్బందిని నిలదీయగా వారు పొంతనలేని సమాధానం చెప్తూ వారిని తప్పుదో పట్టించారు. ఇలాంటి సంఘటనలు హాస్పిటల్లో గతంలో ఎన్నో జరిగిన జిల్లా వైద్యాధికారుల నిమ్మకు నీరెత్తినట్లు ఉంటూ మామూలు వసూలు తీసుకుంటూ మాకేం తెలియదు అన్నట్టు చేతులు దులుపుకుంటున్నారు. తక్షణమే ఈ హాస్పిటల్ పైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ డిమాండ్ చేసింది. లేదంటే దీనిపైన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట అసెంబ్లీ ఇన్చార్జి పంగా బాబు స్వామి రాజు మహేష్గార్లు పాల్గొన్నారు.



# మహంకాళి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటు

**- టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు**

**సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట జూలై 14 :**



రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మహంకాళి ఆలయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు రామాయంపేట పట్టణానికి చెందిన టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతారావు మీడియాకు వెల్లడించారు. ఈ ఆలయ కమిటీలో దోమకొండ యాదగిరి, మర్కు గంగారం,పిట్ల ప్రకాష్, బైరం స్వప్న, డి. అనిత, భూమ కిషన్, గుండ్ల లింగం, బీర రామచంద్రం, మంగలి సత్తయ్య, రమావత్ మంజుల, సామల రవి లను కార్యవర్గ సభ్యులుగా నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వీరి నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, మంత్రి కొండా సురేఖకు, మంత్రి దామోదర రాజనర్సింహకు, యువ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుకు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావుకు నూతన కార్యవర్గం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టిపిసిసి కార్యదర్శి సుప్రభాత్ రావు తెలిపారు